భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమవరం ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మెంటేవారితోటలోని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయంలో 40 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పండ్లు, ఆకు కూరలతో శాకాంబరి దేవిగా అలంకరణ చేశారు. భీమవరం త్యాగరాజు భవనంలో కొలువైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శాకాంబరిగా విశేష అలంకరణ చేశారు. జువ్వలపాలెం రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణాలయంలో..

ఉండి: ఉండి కొత్తపేటలో వేంచేసియున్న కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జి కృష్ణదాస్ తొలి ఏకాదశి ప్రత్యేకతను వివరించారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయంలో..

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి శ్రీస్వామివారి నామ సంకీర్తన, భీమవరం శ్రీరామచంద్ర జీయర్ స్వామివారి శిష్యులతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులకు ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.


శాకాంబరి అలంకరణలో బాలత్రిపురసుందరిదేవి


శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ఉండి కృష్ణాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కాళ్లకూరులో ప్రత్యేక అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి


బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న దంపతులు


కాళ్లకూరులో వెంకన్నకు ఊంజల్ సేవ నిర్వహించిన దృశ్యం

క్లుప్తంగా

వైహెచ్ఏఐ రాష్ట్ర అధ్యక్షుడు సోమరాజుకు సత్కారం


సోమరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: యూత్ హాస్టల్స్ ఉద్యమం యువతకు దిక్సూచి వంటిదని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సోమరాజు అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలో బుధవారం నిర్వహించిన వైహెచ్ఏఐ భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం డాక్టర్ సోమరాజును సత్కరించారు. యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకట నర్సింహ సీతారామరాజు రాజు, కార్యదర్శి నందమూరి రాజేష్, కోశాధికారి బొండా శ్రీరామ్, మల్లినీడి తిరుమలరావు, పాల్గొన్నారు.

కళ్ల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



వాండ్రం వైద్య శిబిరంలో ఓ మహిళకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: వాండ్రం గ్రామంలో భీమవరానికి చెందిన కృష్ణా ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రోగులు నేత్ర వైద్య పరీక్షలు చేయించుకోగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళ్ల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. శిబిరంలో కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి నిర్వాహకులు ఉచితంగా చేయిస్తారని, అవసరమైన మందులు, కళ్లజోళ్లను ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి

వీరవాసరం: రజకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రజక సంఘ మండల నాయకులు పాలకోడేటి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నవుడూరు పద్దాలంకమ్మ వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో రజకుల చెరువులను ఇంతవరకు పూర్తి స్థాయిలో అప్పగించలేదన్నారు. 50 సంవత్సరాలు దాటిన రజకులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వద్దిపర్తి శ్రీనివాసరావు, యండమూరి సుబ్బారావు, మండపాక కొండ, కనకం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

వీరవాసరం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. వీరవాసరం, రాయికుదురు, కొణితివాడ, మత్స్యపురి, తోకలపూడి, నవుడూరు జంక్షన్, పంజావేమవరం గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నారాయణం శ్రీనివాస దీక్షితులు, రామకృష్ణ శర్మ, కొడమంచిలి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పీర్ల ఊరేగింపు

పెనుగొండ: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని వడలిలో గురువు సజ్జాద్ తనయుడు రియాజ్ పయాజ్ ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. బుధవారం పిట్టలవేమవరం రోడ్డు నుంచి పోతురాజు గుడి వర వద్ద నాగూర్ మీరా సాహెబ్ సంబరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గత 56 సంవత్సరాలుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తూ మత సామరస్యాన్ని, ఐక్యతను చాటుకుంటున్నారు. పీర్ల ఉత్సవంలో భాగంగా నిప్పుల గుండం తొక్కారు. శనివారం అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

పెనుగొండ: ప్రతి ఒక్కరూ సేవా మార్గంలో నడవాలని మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు అన్నారు. బుధవారం పెనుగొండ ఎస్ఆర్‌కే విల్లాలో మండ ప్రసాద్ దంపతుల సహకారంతో పేదలకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యదర్శి షేక్ మస్తాన్, కోశాధికారి నరసింహరావు, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, కర్రి నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

దళిత వాడల్ని అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న నన్నేటి పుష్పరాజ్

ఆకివీడు: దళిత వాడల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని తరటావ గ్రామంలో విద్యుత్ షాక్‌కు బలైన మాలమహానాడు గ్రామ కార్యదర్శి యాళ్ల రమేష్ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నూరుశాతం వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటించి దళితవాడల సమస్యల్ని గుర్తించాలన్నారు. వీటిలో అత్యవసరమైన పనులకు నిధులను తక్షణం కేటాయించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు నేతల సాల్మన్‌రాజు, తోర్లపాటి భాగ్యరాజ్, చిగురుపాటి రాజేష్, మేడిది సాయి జగన్నాథ్, కేదాసి నాగరాజు, కేదాసి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: రహదారులపై ప్రయాణించే ప్రతి ద్విచక్రవాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు.

బస్ షెల్టర్లలో ఆక్రమణల తొలగింపు


మోగల్లు బస్ షెల్టర్‌లో ఆక్రమణలు తొలగించి శుభ్రం చేసిన దృశ్యం


శృంగవృక్షం బస్సు షెల్టర్ బాగు చేసిన దృశ్యం

సాక్షి స్పందన

పాలకోడేరు: మోగల్లు, శృంగవృక్షం గ్రామాల్లోని బస్ షెల్టర్లలో ఆక్రమణలను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బుధవారం తొలగించారు. 'నీరుగారుతున్న దాతల ఆశయం' శీర్షికన ఈ నెల 14వ తేదీన ప్రచురితమైన కథనంపై ఆయా పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన బస్ షెల్టర్లు అన్యాక్రాంతం కావడం, పారిశుధ్య నిర్వహణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు 'సాక్షి' కథనంతో స్పందించి ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. మోగల్లులోని బస్ షెల్టర్‌లో ఆక్రమణలు తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. అలాగే శృంగవృక్షం గ్రామంలోని బస్‌షెల్టర్‌లో తిష్టవేసిన యాచకులను అక్కడ నుంచి పంపించివేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే పరిసరాలను శుభ్రం చేయకుండా వదిలివేయడం గమనార్హం.

మోగల్లు మాజీ సర్పంచ్ పుష్పావతి మృతి


పుష్పావతి (ఫైల్)

పాలకోడేరు: మోగల్లు మాజీ సర్పంచ్ కొత్తపల్లి పుష్పావతి (57) బుధవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ కొద్ది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమెకు భర్త, ఒక కుమార్తె ఉన్నారు. ఈమె భర్త, టీడీపీ నాయకుడు కొత్తపల్లి వీఎస్ఎస్ సూర్యనారాయణరాజు కూడా గతంలో సర్పంచ్‌గా పని చేశారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, సర్పంచ్‌లు చాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, సర్పంచ్‌లు మల్లిపూడి కృష్ణకుమారి, మాజీ సర్పంచ్‌లు గాదిరాజు సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దొడ్డా విసు, పెన్మత్స నాగ రామకృష్ణంరాజు, టీడీపీ మండల అధ్యక్షులు దెందుకూరి కోటిరాజు, మల్లిపూడి శ్రీను తదితరులు పుష్పావతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం


భీమవరంలో విద్యార్థి జయారమ్యశ్రీకి చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతల సహకారం ఎప్పుడూ ఉంటుందని కేంద్ర ఉక్కు, గనులశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణపవరం మండలానికి చెందిన అల్లూరి జయారమ్యశ్రీ కళాశాల ఫీజు చెల్లించే నిమిత్తం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రూ.30 వేలు సమకూర్చగా ఆ మొత్తాన్ని బుధవారం విద్యార్థినికి అందించిన సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడారు. జయారమ్యశ్రీ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. మెరిట్ విద్యార్థుల ఉన్నత చదువులకు దాతలు మరింత సహకారం అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసవర్మ ఆకాంక్షించారు.

రోడ్లపై ఆవుల సంచారం కట్టడికి వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుంకరదాసు

భీమవరం (ప్రకాశం చౌక్): రోడ్ల మీదకు విచ్చలవిడిగా ఆవులను వదులుతున్న యజమానులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలకు గోసంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సుంకర దాసు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై తిరిగే ఆవుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, వీటి వల్ల తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాక ఒక్కో సందర్భంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో పశువైద్యులను తీసుకెళ్లి ఆవులకు చికిత్స అందిస్తున్నామన్నారు. అలాగే వారానికి 10 నుంచి 15 ఆవులు చనిపోతున్నాయని, వాటికి తమ బృందం అంత్యక్రియలు నిర్వహిస్తోందన్నారు. మూగజీవాలను రోడ్లమీదకు వదిలేసే వారిపై చర్యలు తీసుకుని గోవులను రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'ఆర్ఆర్‌డీఎస్'లో అదనపు తరగతి గదుల ప్రారంభం


కళాశాల అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మోషేన్‌రాజు, అంజిబాబు, రఘురామ

భీమవరం: విద్యార్థుల భవిష్యత్ అధ్యాపకులపైనే ఆధారపడి ఉందని, ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నందున ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం టుటౌన్‌లోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన అదనపు తరగతుల గదులను భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), కనుమూరి రఘురామకృష్ణంరాజుతో కలిసి మోషేన్‌రాజు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో అవసరం మేరకు అదనపు తరగతులను ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే

ఆకివీడు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆగస్టు 15వ తేదీ లోగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణంరాజు అధికారులను ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డ్రైయినేజీ, ఆర్వో ప్లాంట్, సిబ్బంది నియామకం, డంపింగ్ యార్డు తరలింపు తదితర సమస్యలను ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎండీ. అజ్మీనా నజ్రీన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆసుపత్రుల సమన్వయ కర్త పగడాల సూర్యనారాయణమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన

భీమవరం (ప్రకాశం చౌక్): మున్సిపల్ కార్యాలయంలో మరుగుదొడ్ల ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే అంజిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, అధికారులు పాల్గొన్నారు.

అంజన్న సేవలో ఎమ్మెల్యే పులపర్తి

వీరవాసరం: నందమూరుగరువులో వేంచేసియున్న శ్రీరామభక్త ఆంజనేయస్వామివారిని బుధవారం భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొడికలపూడి చినబాబు, కొప్పినీడి శ్రీనివాసరావు, జవ్వాది బాలాజీ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రీచార్జి ధరలను తగ్గించాలి

పోడూరు: పెంచిన సెల్‌ఫోన్ రీఛార్జి ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం పోడూరు శాఖ కార్యదర్శి బొంతు శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బల్ల వంతెన వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తుందన్నారు. ప్రభుత్వసంస్థలకు పెట్టుబడులు పెట్టకుండా ప్రైవేటు రంగాలకు వేలకోట్లు దారాదత్తం చేస్తుందన్నారు. ఒక పక్క వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గోరుచుట్టుపై రోకలిపోటులా సెల్‌ఫోన్ రీఛార్జి ధరలు పెంచడం దారుణమైన నిర్ణయమన్నారు. ధర్నాలో డి.నాగేశ్వరరావు, కె.శేషగిరి, జోగి కనకం, జి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహికి గ్రామోత్సవం


వారాహి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


వారాహి అమ్మవారికి సమర్పించిన సారె

ఆకివీడు: స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలో వేంచేసియున్న వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో వారాహి దేవి వ్రతం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు సారె సమర్పించి, గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు మొవ్వ సుబ్రహ్మణ్య రవి ఆధ్వర్యంలో మహిళలు స్వీట్లు, పండ్లు, పువ్వులతో అమ్మవారి విగ్రహాన్ని చేత పట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయంలో వారాహి హోమం అనంతరం భక్తులు దీక్షా విరమణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

'చీమలకోడు' తవ్వకం ప్రారంభం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వరిధనంలో చీమలకోడు పంట కాలువ తవ్వకం పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఇరిగేషన్ శాఖ నుంచి రూ.6.60లక్షల నిధులు మంజూరు కావడంతో మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, కార్యదర్శి పాముల రజనీ కుమార్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ పంట కాలువ మరమ్మతులు చేయడం వల్ల వర్షాకాలంలో పంట చేలు ముంపునకు గురికావన్నారు.

నారుమడిపై నిమ్మరసం పిచికారీ చేయాలి


కుక్కలవారితోటలో నిమ్మరసాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

మొగల్తూరు: నీరు నిలిచిపోయిన నారుమడులపై నిమ్మరసాన్ని పిచికారీ చేస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోటలో బుధవారం నిమ్మరసాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్లు కలిపిన నిమ్మరసాన్ని పిచికారీ చేస్తే నారుమడికి రోగనిరోధక శక్తి పెరిగి నారు ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఎకరా నారుమడిలో 250 మిల్లీ లీటర్ల నిమ్మరసాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కోడిగుడ్లు కలిపిన నిమ్మ రసం ఆరు నెలలు వరకు నిలువ ఉంటుందని, ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కర్రి లక్ష్మీ కుమారి, కె.మహాలక్ష్మి, రామలక్ష్మి దుర్గాభవాని, జి.కనకదుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ యాత్ర

పెనుగొండ: సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986–87 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ యాత్ర నిర్వహించారు. వారం రోజుల పాటు సుమారు 50 మంది వారి కుటుంబ సభ్యులతో తమిళనాడులోని అరుణాచలం, సిరిపురం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకుని బుధవారం సిద్ధాంతం గ్రామానికి చేరుకొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఆదుకోవడంలోనూ, పాఠశాల అభివృద్ధిలోనూ 1986–87 వ సంవత్సర పూర్వ విద్యార్థులు తమదైన ముద్ర వేసుకున్నారు. కార్యక్రమానికి గ్రూపు కోఆర్డినేటరుగా చిలువూరి గంగాధర రాజు(శివ), మహిళా కో–ఆర్డినేటరుగా కముజు శశిదేవి పాల్గొన్నారు.